# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కృష్ణా జిల్లా గన్నవరంలో ఈ రోజు జరిగే జాతీయ విపత్తు నిర్వహణ దళం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల కోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ చేరుకున్నారు.**

**2.** **'స్వచ్ఛ ఆంధ్ర' సాధన కోసం అందరూ కలిసి పనిచేయాలని 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**

**3.** **సింగపూర్‌కు చెందిన ఎస్టీ టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్ తెలంగాణలో 3 వేల 500 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.**

**4.** **యజమానుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేస్తామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

జాతీయ విపత్తు నిర్వహణ దళం.. ఎన్డీఆర్ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల కోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వచ్చారు. నిన్న రాత్రి గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకున్న అమిత్ షాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా అమిత్ షాకు.. చంద్రబాబునాయుడు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ రోజు కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగే ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో అమిత్ షా, చంద్రబాబునాయుడు పాల్గొంటారు.

-------------------------

'స్వచ్ఛ ఆంధ్ర' సాధన కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిన్న

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కోసం పని చేయాలని కోరారు. ఇల్లు, పరిసరాలు బాగుంటేనే మంచి ఆలోచనలు వస్తాయని.. ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే ఏదైనా సాధించగలమని ముఖ్యమంత్రి వివరిస్తూ...

...వాయిస్.. 29 సెకన్లు

---------------------------

సింగపూర్ దేశానికి చెందిన ఎస్టీ టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్ తెలంగాణలో 3 వేల 500 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనుంది. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల సమీపంలోని మీర్‌ఖాన్‌పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను స్థాపించేందుకు ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం..ఎంవోయూ చేసుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రతినిధి బృందం రెండో రోజు సింగపూర్ పర్యటనలో ఈ ఒప్పందం జరిగింది. ముఖ్యమంత్రి, ఐటీ పరిశ్రమల మంత్రి డి.శ్రీధర్‌బాబు నిన్న సింగపూర్‌లోని ఎస్టీటీ గ్లోబల్ డేటా సెంటర్ కార్యాలయాన్ని సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రేపటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తామని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించి గోడపత్రికలు, కరపత్రాలను విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన నిన్న విడుదల చేశారు. 11 రోజుల పాటు పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశుయాజమాన్యంపై శాస్త్రీయ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మంత్రి వివరించారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

తెలంగాణలో రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అర్హులకు రేషన్ కార్డులు అందేవరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులగణన, సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ఆధారంగా, పాత రేషన్ కార్డుల సమాచారం ప్రకారం అర్హుల పేర్లు నమోదు చేశామని నిన్న ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులని భావించినవారు.. ఎవరికైనా కార్డులు రాకపోతే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని.. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

---------------------------

యజమానుల సమక్షంలోనే భూములను రీ-సర్వే చేస్తామని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. యజమానులు భూమి వద్దకు వచ్చి హద్దులు చూపించేందుకు మూడుసార్లు అవకాశం కల్పిస్తామని తెలిపారు. అప్పటికీ రాకుంటే దృశ్యమాధ్యమ విధానం ద్వారా ప్రక్రియను పూర్తిచేస్తామని నిన్న విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. రేపటి నుంచి ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద రీ-సర్వే ప్రారంభిస్తామని.. యజమానులకు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా సమాచార బృందాలను ఏర్పాటు చేశామని రెవెన్యూశాఖ మంత్రి వివరించారు.

---------------------------

గుంటూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో అధికారులు క్రియాశీలకంగా

వ్యవహరించి వేగంగా అభివృద్ధి సాధించేలా చూడాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిన్న ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రైల్వే ప్రాజెక్టులతో పాటు రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ రోడ్లు, అమృత్, గ్రామీణాభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. పిఎంజీఎస్‌వై పథకం కింద గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి 12 రోడ్లు మంజూరు కానున్నాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేస్తూ...

...వాయిస్..29 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 118వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ప్రముఖ ప్రజా కవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి ఈ రోజు. ఆ మహనీయుని జయంతి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది. వేదాంతాన్ని అతి సామాన్య మానవునికి సైతం అందుబాటులో ఉండేట్టు స్వచ్ఛమైన, అచ్చమైన తేట తెలుగు పద్యాలలో వివరించిన మహానుభావుడు.... యోగి వేమన. వేమన పద్యం గురించి తెలియని తెలుగు ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. బ్రిటిష్ అధికారి సి.పి. బ్రౌన్ చొరవతో వేమన పద్యాలు వెలుగులోకి వచ్చాయి.

---------------------------

తెలంగాణాలో ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకానికి అర్హులనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని, సాంకేతిక కారణాలతో పేదలకు నష్టం కలగకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ-సీతక్క ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో అధికారులు సామాజిక స్పృహతో వ్యవహరించాలని, సాంకేతిక కారణాలతో పేదలకు నష్టం కలగకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ కార్యాలయంలో నిన్న ఆమె ఆత్మీయ భరోసా పథకంపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సామరస్య పూర్వక వాతావరణంలో గ్రామసభలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఏ స్థాయి అధికారులైనా అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని సీతక్క స్పష్టంచేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు నిన్న ప్రారంభమయ్యాయి. 1.396 కిలోమీటర్ల పొడవైన డయాఫ్రం వాల్‌ను 1.5 మీటర్ల వెడల్పుతో నదీ ప్రవాహ మార్గంలో భూమి లోపల నిర్మించనున్నారు. పాత డయాఫ్రమ్ వాల్‌కు 6 మీటర్ల ఎగువన కొత్త నిర్మాణం చేపట్టనున్నారు. సగం నిర్మాణం పూర్తి కాగానే సమాంతరంగా దాని పైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ షెడ్యూలు జారీ చేసింది. కొత్త డయాఫ్రం వాల్ కోసం 990 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేయనుంది.

=====================